# నడుస్తున్న చరిత్ర



నా గుండె గుభేలుమనింది. కాళ్ళు తడబడ్డాయి. తలకూడా కొద్దిగా తిరిగినట్లనిపించింది. అడుగు ముందుకు పడలేదు. అయోమయమైన పరిస్థితి. ఎటూ కదలలేకుండా నిలబడ్డాను!

అతడు అక్కడ ప్రత్యక్షమవుతాడని కలలో కూడా అనుకోలేదు!

అతడు నన్ను చూశాడో లేదో తెలియదుగానీ నేను మాత్రం అతనిని చూశాను!... అతని కంటపడకుండా ఎలా తప్పించుకొనిపోవడమా? అని ఆలోచిస్తున్నాను. ఆలోపలే అతని కంటపడ్డాను. అప్పుడేం చేయాలి?

ముందుకు పోలేను. అలాగని వెనక్కు తిరిగి వెళ్ళిపోదామా? అంటే– మనసు ఒప్పలేదు. మనసు ఒప్పలేదని ఆ నడిరోడ్డులో నిలువురాయిలా నిలబడలేను. అనుకోనిరీతిగా ఊహించని పరిస్థితిలో ఇరుక్కొన్నట్లయింది.

ఇప్పుడేం చేయాలిరా తండ్రీ!

ఏమీ చేయలేని పరిస్థితిలో తటపటాయిస్తూనే మళ్ళీ అతనివైపు ఒకసారి చూశాను.

అతడే!- అదే నొక్కునొక్కుల జుట్టు... ఆ ముఖానికే ముచ్చటగొలిపే ముక్కు... ఒక్క వన్నె అటోయిటోగా నిమ్మపండు రంగు... ఆరడుగుల ఎత్తు... సందేహంలేదు. అతడే! అతడే!

మనిషిని పోలిన మనిషి ఉండవచ్చును కదా? అనుకొందామంటే ఆ స్కూటర్! అతడు నిలబడినచోట పదిమంది స్నేహితులు!... వస్తూపోతూ ఉన్న జనం చేస్తున్న నమస్కారాలు! అతడైతేనే ఆ హడావిడి! ఇటువంటి హడావిడివున్న చోటే అతడు!

ఇక ఏ పరిస్థితిలోనూ అతడిని తప్పించుకొనిపోవడానికి వీలుపడదు. వీలుపడదంటే ఎదుటపడాలి. ఎదుటపడ్తే?...

"ఏఁవండీ? మీరు చెప్పిందేఁవిటి? చేసిందేఁవిటి? ఇది మీకు న్యాయమా?" అని నిలదీస్తే ఏమని బదులు చెప్పాలి?

నిజమే కదా? అతడేకాదు. అతడి స్థానంలో ఎవరున్నా అదేమాట అడుగుతారు. ఎందుకు అడగరు? క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకొన్న ఎవరైనా అదేమాట అడుగుతారు. అది మానవనైజం!

అప్పటి తన పరిస్థితి అలాంటిది? తలుచుకొంటే ఇప్పటికి కూడా తలదిమ్మెక్కుతుంది. పగవాడికి కూడా వద్దురా తండ్రీ ఈ పలుబాట్లు!... అని ఎన్నిసార్లు తలపట్టుకోలేదు?

ప్రతిరోజు ఉదయం పదిగంటలకు అక్కడికి వెళ్ళడం...తిండీతిప్పలు కూడా లేకుండా ఆ వరండాలో పడిగాపులు కాయడం... వస్తూ పోతూ ఉన్నవాళ్ళ ఆకలిచూపుల్ని సాయంత్రం అయిదు గంటలదాకా భరించడం... అప్పుడు "నీలాంటి వాళ్ళకిక్కడ ప్రవేశంలేదు. ఇంకా ఎందుకు నిలబడతావ్?" అన్నట్లుగా ఆఫీసు తలుపులు మూతలు పడుతూంటే నిస్సహాయంగా వాటివైపు చూడడం... మొహం వాలేసుకొని తిరిగి ఇంటికి వెళ్ళడం- 'తెచ్చావా అక్కయ్యా?'- అంటూ తమ్ముడు ఎదురుపడితే వాడిమీద ఎగిరిపడడం- అత్తమీద కోపమంతా దుత్తమీద చూపినట్లుగా!

ఒక్కరోజుకాదు. రెండురోజులు కాదు. వారంరోజులుగా జరుగుతున్న తంతేయిది! ఇంకొక వారంరోజులయినా అక్కడ నాపని జరుగుతుందన్న నమ్మకం కుదరలేదు. అలాగని చేతులు ముడుచుకొని కూర్చోవడానికి వీలులేదు.

ఏం చేయాలి?

పల్లెటూరిదాన్ని. పెద్దగా చదువు సంధ్యలు లేనిదాన్ని. చేయని తప్పును అంటగట్టి కట్టుకొన్నవాడు తప్పుకుంటే తల్లిపంచన తలదాచుకొంటున్నదాన్ని. తాళిగట్టిన పుణ్యాత్ముడు అపనిందను అంటగట్టాడు. అదీ చాలదని ఓ కసుగందును చేతికి ఇచ్చాడు. ఆ కసుగందునూ, కాలూచేయీ ఉడిగిన తల్లినీ... రెక్కలు వచ్చీరాని తమ్ముణ్ణీ రెక్కల కష్టాన సాకుతున్న దాన్ని. కురుకురు మీసం వస్తున్న కుర్రనాకొడుకులు మొదలుకొని తలనెరిసిన తాతల వరకు చూస్తున్న ఆకలిచూపులకు అర్థంతెలిసినా తెలియనట్లు నటిస్తున్నదాన్ని. అటువంటప్పుడు నాగోడు ఎవరితో వెళ్ళబోసుకోవాలి? వెళ్ళబోసుకొన్నా వినేవాళ్ళెవరు? విన్నా 'అయ్యో పాపం!' అన్న సానుభూతి

చూపే వాళ్ళెవరు? మబ్బు విడిచిన ఎండను మొగుణ్ణి విడిచిన ముండను ఓగాట కట్టేసిన ఈ సమాజానికి నా వంపుసొంపులతో పనేకానీ నా బాగోగులతో ఏంపని?

"ఏయ్? ఇది రోడ్డనుకున్నావా? నీయింటి గుమ్మం అనుకొన్నావా? కొంపలో చెప్పే వచ్చావా?"

రోడ్డు మీద వస్తున్న కారు నాపక్కనే ఆగింది. డ్రైవర్ తల బయటపెట్టి అడుగుతున్నాడు. ఆ చూపుల్లో ఛీత్కారం... ఆ మాటల్లో వెటకారం-తలకొట్టేసినంత పని అయింది. ముందుకు పోలేను. వెనక్కు వెళ్ళలేను. అందుకే రోడ్డుపక్కకు జరిగి ప్లాట్‌ఫారం మీద నిలబడ్డాను.

నేను నిలబడ్డ చోటికి సరిగ్గా రెండుబారల దూరంలో అతడు!

అతని చుట్టూ అయిదారుమంది.

అతడు నన్ను చూడననట్టుగానే చూస్తున్నట్టుంది. తప్పించుకొనిపోవడానికి వీలుకాని పరిస్థితి. పోనీ! ఆ రోడ్డు మీద వస్తూపోతున్న మొహాల్ని చూసీచూడనట్టుగా చూస్తూ కాసేపు నిలబడితే- అతడు తన దారినతాను వెళ్ళిపోతే అప్పుడు నాదారినాది. ఎవరిదారి వాళ్ళదైనపుడు ఏబాధా ఉండదు.

అందుకే ఆ ప్లాట్‌ఫారం మీద అటుయిటు చూశాను. నాలాంటి వాళ్ళు నలుగురైదుగురు నిలబడివున్న చోటును వెదుక్కొన్నాను. వాళ్ళతో కలిసి నిలబడ్డాను.

అయినా మనసు నిలబడలేదే?

అది ఆరునెలల వెనక్కి పరిగెత్తింది.

అప్పుడు-

కూలికిపోతే కుండగాలు. లేకుంటే కడుపులుగాలు. అయితే ఆ పరిస్థితి ఇప్పుడు మారిపోయిందనా? లేదు. ఆ పరిస్థితిలో కూడా ఒకే ఒక్క తమ్ముడి కంట కన్నీళ్ళు చూడకూడదని ఎమ్మార్వో ఆఫీసుకు ఉదయాన వెళ్ళడం... ఉసూరుమంటూ సాయంత్రం కొంపకు తిరిగిరావడం!

ఎందుకు?

ఓ ఆదాయం సర్టిఫికెట్ తెచ్చుకోవడానికి!

నా ఆదాయం నాకు తెలుసు. నాకు తాళికట్టి తరిమికొట్టిన వాడికి తెలుసు. నన్ను కన్న తల్లికి తెలుసు. నేను బతుకుతున్న ఊళ్ళోవాళ్ళకు తెలుసు. నా తమ్ముడు చదువుకొంటున్న హైస్కూలు హెడ్మాస్టర్‌గారికీ తెలుసు.

బియ్యానికి పచ్చకార్డు ఇచ్చిన మా మండలాధికారికి ఇంకా బాగా తెలుసు!

అందరికీ తెలిసినా తెలియనట్లే లెక్క!

తెలిసినా తెలియనట్లు నటిస్తున్న వాళ్ళ దగ్గర నా ఆదాయం సర్టిఫికెట్టు సంపాదించాలి. దానిని మా తమ్ముడి చేతికి ఇవ్వాలి. వాడు దాన్ని జాగ్రత్తగా హెడ్మాస్టర్ గారికి అందచేయాలి. అపుడా హెడ్మాస్టర్‌గారు స్కాలర్‌షిప్ పితకాలి!

ఈ ఒక్క సర్టిఫికెట్ కోసం వారంరోజులుగా తిరుగుతున్నాను. తిరిగి తిరిగి కాళ్ళు అరిగిపోతున్నాయి. ఒక్కపూట కాకపోయినా ఇంకొక పూట పొయ్యిలో పిల్లి పడుకొంటూ ఉంది. తల్లిపాలకోసం తపించే కసుగందు ఏడుపు తలుచుకుంటే కడుపులో చెయ్యేసి దేవినట్లవుతుంది. కడుపు రగులుతుంది. పేదదానికోపం పెదవికి చేటని మనసు చెబుతుంది. కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరుగుతాయి!

ఆ కన్నీళ్ళు ఎవరికంటా పడకూడదని జాగ్రత్తపడుతూనే ఉన్నాను.

అయినా వారంరోజుల తర్వాత ఆ కన్నీళ్ళు ఎవరో ఒక పుణ్యాత్ముడి కంటపడనే పడ్డాయి!

"అమ్మాయ్! వారంరోజులుగా చూస్తున్నాను. వస్తున్నావు. పోతున్నావు. ఇది ఎమ్మార్వో ఆఫీసు. ఒకప్పుడిది తహసీల్దార్ ఆఫీసు. ఇప్పుడు మండలాఫీసుగా మారింది. మారింది పేరే! మనుషులు వాళ్ళే. పద్ధతులు అవే. ఇక్కడ కాసేపు నిలబడి బయల్దేరుతున్నావనుకో! ఆ స్థలం 'ఏం నన్ను గమనించకుండా పోతున్నావే?' అని నిలదీస్తుంది. ఆ స్తంభానికి కాసేపు ఆనుకొని నిలబడ్డావనుకో! అది కూడా నిన్ను అదేమాట అడుగుతుంది. ఇన్ని దినాలుగా వస్తున్నావు. ఇది నీకు ఇంకా అనుభవానికి రాలేదంటే ఆశ్చర్యంగా ఉంది. ఈ మాత్రం అనుభవానికి రాకపోతే ఇక ఇక్కడ నిన్ను పలకరించే నాథుడుండడు"

"అయితే నేనేం కావాలి?"

"నేనేం కావాలి అనొద్దు. నీకేం కావాలో చెప్పు"

"ఇన్‌కం సర్టిఫికెట్"

ఆమాట వింటూనే ఆ పెద్దమనిషి పకపక నవ్వాడు. ఎందుకు నవ్వుతున్నాడో అర్థంకాలేదు. ఎందుకు నవ్వుతున్నారని అడగలేను. ఆ నవ్వు భరించలేను. అందుకే అతని వైపు అమాయకంగా చూస్తున్నాను. నిజంగా నామీద అతనికి జాలి కలిగినట్లుంది.

"అమ్మాయ్! ఇన్‌కం సర్టిఫికెట్ ఇక్కడెవరిస్తారు నీకు? నీ ఆదాయం ఇంతని రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ రాతమూలకంగా రాసి ఇవ్వాలి. దానిని మండలాధికారి అమోదించాలి. అప్పుడు దానికి సంబంధిత గుమాస్తా సర్టిఫికెట్ రాసి ఇవ్వాలి. అంతేకానీ ఈ వరండాల్లో ఒంటికాలిమీద నిలబడి తపస్సు చేసినా నిన్ను పలకరించే నాథుడుండడు. అందువల్ల నువ్వు సరాసరి రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ దగ్గరికి వెళ్ళు"

"ఆ పుణ్యాత్ముడెక్కడుంటాడు?"

"ఆయన ఉండేది కూడా ఈ ఆఫీసులోనే. అయితే ఆయన ఏడూళ్ళ మణేగాడు. వస్తే ఆఫీసుకు వస్తాడు లేకపోతే లేదు. ఆయన ఇల్లు పాతపేటలో మూలస్థానమ్మ గుడి సందులో. అక్కడికి వెళ్ళు ఎవరినడిగినా చెప్తారు"

అప్పుడు వెళ్ళాను అతన్ని వెదుక్కొంటూ! ఉదయం పదిగంటలలోపుగా వెళితేకానీ అతడు దొరకడన్న సంగతి మనసులో మెదులుతూనే ఉంది. అందుకే ఆ మరసటిదినం ఠంచనుగా ఎనిమిదగంటలకే అతని ఇంటిముందర నిలబడ్డాను.

అప్పుడు అంటే ఆరునెలలకిందట అతనిని చూశాను.

ఇప్పుడు ఈ ప్లాట్‌ఫారంమీద నిలబడి చూస్తున్నాను.

అతగాడు అక్కడొక చిన్న మీటింగే పెట్టినట్టుంది. ఎడమ కాలెత్తి స్కూటర్‌మీద పెట్టాడు. స్కూటర్ సీటుమీద కూర్చున్నాడా లేదా అన్నట్లుగా కూర్చున్నాడు. జానెడు పొడుగు సిగరెట్ ఎర్రటి పెదవులమధ్య ఇరుక్కొని ఉంది– నేను ఇరుక్కొన్నట్లుగా! అది నుసిగా రాలుతూ ఉంది. నేను నలుగుతూ ఉన్నాను. సిగరెట్ కాలికాలి బూడిదవుతుంది. మరి నేను?

అతడు నావైపు చూస్తున్నట్లూ ఉంది. లేనట్లూ ఉంది. చూస్తున్నడా లేదా అన్న అనుమానం. అనుమానం పెనుభూతం. ఈ పెనుభూతం వాతపడి నలగడంకంటే వెళ్ళి పలకరిస్తే సరిపోతుంది. వెళదామా అనుకొంటూనే వెళ్ళలేకపోతున్నాను.

అదే ఆరోజు?–

ఉదయం ఎనిమిది గంటలకు అతని ఇంటిముందు నిలబడ్డాను. నాకంటే ముందుగా ఎప్పుడు వచ్చారో ఏమో లావు లావు మనుషులు...సన్న సన్న మనుషులు... ఖద్దరు జుబ్బాలు, చినిగిన చొక్కాలు. పది పదిహేనుమంది ఉంటారు. ఖద్దరు జుబ్బాలు వరండాల్లో కుర్చీల నిండుకు కూర్చున్నాయి. చినిగిన చొక్కాలు చేతులు కట్టుకొని ఇంటి ముందు నిలబడి ఎదురుచూపులు చూస్తున్నాయి.

గంట ఎనిమిదైనా అయ్యగారు ఇంకానిద్ర లేవలేదట!

'ఇంకా నిద్రలేవలేదా?' అని. ఏం! ఎందుకు లేవాలి? వాళ్ళేమయినా కూలీనాలీ చేసుకొని బతికే అలగాజనమా? అసోబోసోమని నిద్రకండ్లతో లేచి పరుగెత్తడానికి! వేలువేలుగా జీతాలు తీసుకొనే ఆఫీసర్లు. వాళ్ళకు ఇష్టం వచ్చినపుడు లేస్తారు. ఎంతమంది ఎదురుచూస్తే వాళ్ళకేం? ఎవరు ఏమైపోతే వాళ్ళకేం? అదే నాబతుకు? ఏ పూటైనా కాసంత పాలు మాలి ఆలస్యంగా నిద్రలేస్తే అయ్యో! ఆలస్యం అయిపొయ్యిందే అనుకొంటూ పరుగెత్తితే సిద్ధారెడ్డి ఒప్పుకుంటాడా? పనిలోకి వంగనిస్తాడా? ఒకవేళ వంగనిచ్చినా ఆ నోరు పడేపాటు?

అందుకే కోతికైనా గీత చక్కగా ఉండాలంటారు.

గీత చక్కగా ఉన్నవాళ్ళు ఎనిమిది గంటల దాకా కాదు ఆ పూటంతా పడకేసినా కాదనే నాధుడెవ్వరు?

"అమ్మాయ్?"

ఆరడుగుల మనిషి. ఖద్దరు జుబ్బా మోకాళ్ళకిందికి!... అరచేతి వెడల్పు సరిగంచు పంచెజీరాడుతూ నేలమీద. చిరునవ్వు పెదాలమీద!...

"పిలిచారా?" అన్నట్లుగా అతనివైపు చూశాను.

"చూడమ్మాయ్... గంట ఎనిమిది దాటింది. ఆ మహానుభావుడు పెడుతున్న గురక వీధిలోకి వినపడ్తూ ఉంది. మేమిక్కడికి వచ్చి గంటన్నర అయింది. ఇంట్లో ఆడవాళ్ళు కూడా ఉన్నట్లు లేదు. ఉంటే వాళ్ళయినా అతన్ని నిద్రలేపేవాళ్ళు. పోనీ ఈ ఒక్క పనిచేసి పుణ్యం కట్టుకోరాదూ?"

"చెప్పండి"

"లోపలికి వెళ్ళి అతన్ని నిద్ర లేపరాదూ?"

మొద్దుమొకందాన్ని. పరాయి మగవాణ్ణి నిద్ర లేపవచ్చునా కూడదా అన్న పట్టింపులు కూడా తెలియని పల్లెటూరిదాన్ని. నిద్ర లేపడమేగదా అన్నట్టుగా లోనికి వెళ్ళాను.

నగిషీలు చెక్కిన మంచం. ఆ మంచంమీద జానెడెత్తు పరుపు. ఆ పరుపు మీద అతడు. సుమారిపాటి దిండును రెండు చేతులతో కౌగలించుకొని నిద్రసుఖాన్ని అనుభవిస్తున్నాడు. అతడు పెడుతున్న గురక అలలు అలలుగా లేచి గది గోడల్ని తాకుతూ ఉంది.

"సార్... సార్"

నా పిలుపును గురక శబ్దం నిర్దాక్షిణ్యంగా మింగేసింది.

మళ్ళీ పిలిచాను. గొంతు పెద్దదిచేసి మళ్ళీపిలిచాను.

లాభంలేదు!

సరాసరి మంచం దగ్గరికి వెళ్ళాను. అతడు దిండును లాగిలాగి గుండెలకు అదుము కొంటున్నాడు. నాకు నవ్వు ఆగలేదు. ఎవరి పిచ్చి వాళ్ళకానందం. నేను వచ్చినపని నిద్ర లేపడానికి. నా పని నాది. అందుకే 'సార్ సార్' అంటూ తట్టి లేపాను.

కలగని మేల్కొన్నట్టు ఎగిరిపడి లేచాడు.

ఎదురుగా నేను!

ఆ క్షణంలో అతని బుర్రలో ఎన్ని ఆలోచనలో ఎలా చెప్పగలం? ఆ పరిస్థితి నుండి తేరుకోవడానికి రెండు మూడు నిమిషాలు పట్టింది. ఆ తర్వాత నావైపు ఆశ్చర్యంగా చూస్తూ 'ఎవరు నువ్వు?' అన్నాడు.

ఆ మాటలో ఎంత విసుగు? కమ్మని అనుభూతి కరిగిపోయింది కదా పాపం!

"గంట ఎనిమిదయింది. చాలామంది మీ కోసం ఎదురుచూస్తున్నారు"

"చూస్తే?"

"నిద్రలేపమన్నారు"

"ఎవరు?"

"ఎదురుచూస్తున్నవాళ్ళు!"

"సరేలే వెళ్ళు!"

కసురుకొన్నాడు. నా తల వాలిపోయింది- తప్పుచేసినట్లుగా. జారిన లుంగీని సరిచేసు కొంటూ అతడు లోపలికి నడిచాడు. నేను బయటికి వచ్చాను.

"నిద్ర లేచాడా అమ్మాయ్?" ఖద్దరు కాయం అడిగింది.

"లేచాడు".

అందరి మొగాల్లో అప్పటికైనా నిద్ర లేచాడన్న తృప్తి. అది నాకొకవిధంగా సంతృప్తి. ఆ తృప్తికి మళ్ళీ పరీక్ష పెట్టాడా మహానుభావుడు.

"లేచినట్టు లేచి మళ్ళీ పడుకొన్నాడా?"

"నిద్ర లేచి దాదాపు గంట అవుతూ ఉంది. లోపల ఏంచేస్తున్నాడబ్బా?"

"స్నానం పానం కావాలి కదా?"

"స్నానం తర్వాత పూజా పునస్కారాలంటే ఇంక ఇంతే సంగతులు!"

"ఇంతమంది ఇలా పడిగాపులు కాస్తేనే గదా వాళ్ళ విలువలు పెరిగేది!"

నిద్ర లేచాడని అంతవరకు వాళ్ళ మొగాల్లో వెలిగిన తృప్తి కాలం చేతిలో పడి నలిగి విసుగ్గా మారింది. ఆ విసుగులో నుండి పుట్టిన మాటలు రకరకాలుగా వినిపిస్తున్నాయి.

"ఇక మాట్లాడండి.. ఏం మాట్లాడుతారో చూద్దాం!" అన్నట్లుగా ఉన్నట్లుండి అతడక్కడ ప్రత్యక్షమయ్యాడు.

కుర్చీల్లో కూర్చున్నవాళ్ళు ఎగిరిపడ్డట్టు లేచి నిలబడ్డారు. లేని వినయాన్ని తెచ్చి మొగాల్లో పులుముకొంటున్నారు. చేతులు జోడిస్తున్నారు. నిలబడి ఉన్నవాళ్ళు మరీ వంగి చేతులు నలుపుకొంటున్నారు. ఒక్క క్షణంలో అక్కడి వాతావరణం ఊహించని రీతిగా మారిపోయింది. అదే గమనిస్తున్నాను.

అతడు వచ్చీరావడంతోటే నన్ను చూశాడు.

నేను అతనిని చూశాను.

"మీరు వెళ్ళి లోపల కూర్చోండి"

నన్ను చూస్తూ అన్నాడు. నేను మారు మాట్లాడకుండా లోపలికి నడుస్తున్నాను. అక్కడ నిలబడి ఉన్న పదిమంది చూపులు పదిరకాలుగా నన్ను గుచ్చుతున్న సంగతి గమనిస్తూనే ఉన్నాను. అయినా నాకేం? నేనేం తప్పు చేస్తున్నానా? లేదే? వెళ్ళి లోపల కూర్చోమన్నాడు. వెళ్ళి కూర్చుంటాను. అంతమాత్రానికే ఎందుకా చూపుల్లో మార్పులు? కోతి బుద్ధులంటారే? ఇలాంటివేనేమో?

లోపలికి వెళ్ళి కూర్చున్నాను.

"లోపలికి వెళ్ళి కూర్చోండి!" అన్నపుడు నాకేమీ అనిపించలేదు. లోపలికి నడుస్తున్నపుడు నాకేమీ అనిపించలేదు. తీరా వచ్చి కూర్చున్న తర్వాత 'ఎందుకు కూర్చోమన్నాడబ్బా?' అన్న ఆలోచన మొదలయింది.

ఇంట్లో ఆడవాళ్ళు ఎవరూ ఉన్నట్టు లేదు. ఒంటరిగా ఉన్నాడు. వయసుమీద ఉన్నాడు. ఇంతకు మునుపు పరిచయమా? లేదు. నేనొక మొద్దుమొకందాన్ని. 'లోపలికి వెళ్ళి కూర్చోండి!' అన్నాడో లేదో ముందు వెనుకా ఆలోచించకుండా వచ్చి కూర్చున్నాను. 'ఎందుకు కూర్చోవాలి? వచ్చిన పని చూసుకొని నలుగురితో నారాయణా!. అని వెళ్ళిపొయ్యుంటే సరిపోయేది కదా?

బయట అతని కోసం ఎదురుచూస్తున్న వాళ్ళా లావు లావు మనుషులు. వాళ్ళకే దొరకని మన్నన మర్యాద నాకు దొరికిందంటే? అందులో అంతరార్థం? పోనీ! ఆడమనిషి అని గౌరవించాడనుకొందామంటే? ఈ దర్వేసి మొకానికి అంత మర్యాదా? మొత్తానికి రోటిలో తలదూర్చిన వ్యవహారంగానే ఉంది కథ!-

నా ఆలోచనలు నానారకాలుగా సాగుతున్నాయి. కాలం ముందుకు సాగుతున్నదని గడియారంలో టిక్‌టిక్‌మన్న శబ్దం హెచ్చరిస్తూ ఉంది. ఎక్కడో పిచ్చుకలు కీచులాడుకొంటున్న శబ్దం చెవిని పడుతూ ఉంది.

'ఇప్పుడు చెప్పండి మీ కథ!' అంటూ అతడు లోపలికి వచ్చాడు.

నేను లేచి నిలబడ్డాను!

ఎదురుచూస్తున్న వాళ్ళందరికీ ఎవరెవరికి చెప్పవలసింది వాళ్ళకు చెప్పి ఎవరి దారికి వాళ్ళను సాగనంపి వచ్చినట్లుంది!

"కూర్చోండి! కూర్చోండి!" అంటూ అతడొక కుర్చీని తెచ్చి నా ఎదురుగా వేసి కూర్చున్నాడు. నేను నిలబడి ఉన్నాను.

"మీరు కూర్చుంటారా? లేదు. నన్ను కూడా లేచి నిలబడమంటారా?"

"మీరు ఆఫీసర్లు, మీ ఎదురుగా కూర్చునే యోగ్యత నాకు లేదు"

"నేనిస్తున్నాను కదా?"

"ఒకరిస్తే తీసుకునే యోగ్యత ఎంతకాలం ఉంటుంది?"

"అమ్మో! మాటకారివేనే? పోనీ! శాశ్వతంగా ఇస్తే తీసుకొంటావా?"

"ఆశక్తి మీకు లేదు"

"ఎలా చెప్పగలవు"

"అద్దో! ఆ గోడమీద వేలాడుతున్న ఫోటో చెప్తూఉంది"

"అంటే నాకు పెళ్ళయిందనీ...అందువల్ల శాశ్వతంగా నా ఎదురుగా కూర్చొనే యోగ్యత ఇవ్వలేననీ అంటున్నావ్! మొత్తానికి గట్టిపిండమే దొరికింది"

ఇప్పటికే నేను చేసింది నా యోగ్యతకి మించిన పనుల్ని! పరాయి ఇంట్లో దూరి పరాయి మగవాణ్ణి నిద్రలేపడం... మాటకు మాటయివ్వడం. ఛఛ! శృతిమించి రాగాన పడేదంటే ఇలాంటిదేనేమో!

బుద్ధిగా కుర్చీమీద కుర్చున్నాను.

"అలా ఉండాలి. అదీ మంచి అమ్మాయిల లక్షణం. మరియింత తెలివైన దానివే? పరాయి ఇంట్లో దూరి పరాయి మగవాణ్ణి నిద్రలేపడం తప్పని తెలియదూ?"

"అంతమందిని బయట నిలబెట్టి మీరు ఎనిమిది గంటలదాకా నిద్రపోవడం తప్పని మీకు తెలియదా?"

"వాళ్ళందర్నీ నాయింటికి రమ్మని నేను పిలవలేదే? అనవసరం ఉంటే ఆఫీసుకు వస్తారు."

"మీరు ఆఫీసుకు వస్తేకదా?"

"అంటే?"

"మీకోసం వారం దినాలుగా ఆఫీసుచుట్టూ తిరుగుతున్నాను"

"ఆఫీసుకు రాలేదని ఇంటికొచ్చి నిద్రలేపమన్నారా?"

"నిద్రలేపితే ఏమయింది?"

"ఎటువంటి సమయం అది? నిద్రతోపాటు కోర్కెలు కూడా మేలుకొన్నాయ్"

"అయితే వెంటనే బయల్దేరి రమ్మని మీ భార్యకు టెలిగ్రాం ఇవ్వండి"

"వచ్చినా ఉపయోగం ఉండదుకానీ నువ్వు వచ్చిన పనిచెప్పు"

"నాకొక ఇన్‌కం సర్టిఫికెట్ కావాలి"

"ఇన్‌కం సర్టిఫికెట్టే? అమ్మో? అది అంతసులభంగా వస్తుందా?"

"మీ విలేజ్ అసిస్టెంట్ లేదా గ్రామసర్పంచ్ నీ ఆదాయం ఎంతో రాసియివ్వాలి. అది నిజమో కాదో నేను మీ గ్రామానికి వచ్చి విచారణ జరిపించాలి. తర్వాత మండలాధికారికి నేను రిపోర్టు రాయాలి. నా విచారణ రిపోర్టును ఆయన ఆమోదించాలి. అప్పుడు దానికి సంబంధించిన గుమస్తా సర్టిఫికెట్ రాసియివ్వాలి. ఇదంతా జరగాలంటే కనీసం ఒక్క నెలయినా పడుతుంది.

"ఒక్క నెలా? ఇప్పటికే ఒక్క వారమయింది. ఈ వారం దినాలు కూలికి పోలేదు. ఒక పూట తింటే ఒక పూట లేదు"

"అయితే నన్నేం చెయ్యమంటావ్?"

"దయచూపితే నేనూ దయచూపుతాను"

"నీ మొకాన మజ్జిగ పులుసు కొట్టా? నీకు అమ్మలేదా? అక్కలేదా? కట్టుకున్న పెళ్ళాం లేదా? ఆడది ఒంటరిగా కనపడ్తేచాలు! కన్నెయ్యడంవే? కారుకూతలు కూయడంవే? నీ నాలుక నలభై ముక్కలుగా కోస్తేమాత్రం పాపమా? నా సంగతి తెలియదేమో నీకు? ఈడ్చి ఈడ్చి తన్నినానంటే ఏడ్చి ఏడ్చి పడుకోవాల?" అని అడుగుదామన్నంత కోపం వచ్చింది. అడిగేదెంత సేపు? అడిగితే ఏమవుతుంది? ఈ జన్మకి నాకు సర్టిఫికెట్ దొరకదు. సర్టిఫికెట్ దొరకకపోతే తమ్ముడికి స్కాలర్‌షిప్ రాదు. స్కాలర్‌షిప్ రాకుండాపోతే వాడి చదువుసాగడం కష్టం. అమ్మో! వాడు చదవకపోవడమా? వాడి చదువుతో ఈ కష్టాలన్నీ గట్టెక్కిపోతాయని కలలు గంటున్నానే? ఏంచేయాలి? ఒక పక్కశీలం. మరొకపక్క తమ్ముడి భవిష్యత్తు! నేనేమైనా ఫరవాలేదు. తమ్ముడి చదువు ఆగిపోవడానికి వీల్లేదు. అయినా ఇప్పుడేం కొంపలు మునిగిపోతున్నాయ్. సరేనందాం. సర్టిఫికెట్ చేతికి తీసుకుందాం. ఆ తర్వాత చూద్దాం"

"ఏంవిటి ఆలోచిస్తున్నావ్?"

"అదృష్టం మీదా? నాదా? అని"

"ముమ్మాటికీ నాదే!"

"ఈ కాకిముక్కుకు దొండపండా?"

"కాదు. కాదు. నేనేకాకి. నువ్వు దొండపండు"

నవ్వుతూ అతడు పైకిలేచాడు. నాగుండె గుభేలుమంది. లేచి పరుగెత్తాలనిపించింది. ఒళ్ళంతా చిరుచెమటలు పడుతున్నాయి. ఇప్పుడేంచేయాలి రా తండ్రీ! అని ఆలోచిస్తున్నాను.

అతడు హుషారుగా కూనిరాగాలు తీసుకొంటూ లోనికి వెళ్ళాడు. అదే మంచి సమయం. జారవిడుచుకొంటే మళ్ళీరాదు. లేచి ఒక్క ఊపులో బయటపడ్తే? వచ్చి చూస్తాడు. అప్పుడు తెలుస్తుంది. అయ్యకు ఆడదంటే అంగట్లో బొమ్మకాదని! లేద్దామనుకొంటున్నాను. లేవలేక పోతున్నాను. అంతలోనే అతడు రెండు కప్పుల కాఫీతో వచ్చాడు. ఒకటి నాచేతికి ఇచ్చాడు. ఒకటి తాను తీసుకొన్నాడు.

"మీరు చాలా శ్రమపడుతున్నారు"

"శ్రమకు తగిన ఫలితం దొరికితే అదృష్టవంతుణ్ణే!"

నేను కాఫీ కప్పు నోటి దగ్గర పెట్టుకొన్నాను.

ఇద్దరం కాఫీ తాగుతున్నాం!

ఒక చేతిలో కాఫీ తాగుతూ మరొక చేతితో ఏదోరాశాడు. ఎవరికో ఫోన్‌చేశాడు. అతడు వచ్చాడు. తాను రాసింది అతని చేతికి ఇచ్చాడు. అతడు వెళ్ళినట్లు వెళ్ళి తిరిగి వచ్చాడు.

నా చేతిలో ఇన్‌కం సర్టిఫికెట్!

ఇదంతా జరిగింది అర్థగంటలోపుగానే!!

ముప్పయి దినాలపని ముప్పైనిముషాల్లో జరిగింది. 'ఔరా! మానవుడా!' అనుకొన్నాను. సర్టిఫికెట్ చేతికి తీసుకొని చేతులెత్తి నమస్కరించాను.

'మళ్ళీ ఎప్పుడు?"

"మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు"

బయట పడితేచాలు! అనిపిస్తోంది.

"నీమాట మీద నాకు నమ్మకం ఉంది. నీకోసం ఎదురుచూస్తుంటాను"

ఎదురుచూసుకోరా లోఫర్ నా కొడకా! అనుకొంటూ ఆరోజు బయటపడ్డాను. ఈరోజు మళ్ళీ ఎదుటపడ్డాను!

అక్కడినుండి అతడు అటూయిటూ కదలడే! నన్ను గుర్తు పట్టినట్లుంది. అందుకే అటుయిటు కదలకుండా నిలబడిఉన్నాడు. ఏది ఏమైనా కానీ వెళ్ళి పలకరించాలనుకొన్నాను. అనుకొన్నానే కానీ అడుగు ముందుకు పడదే? -

ఆరునెలలుగా అప్పుడప్పుడు అతడు మనస్సులో మెదులుతున్నమాట నిజం. అతడు మనస్సులో మెదిలితే 'అయ్యో! మాటతప్పానే?' అన్న బాధకలుగుతుంది. అయితే ఆడదానికి మాట ముఖ్యమా? శీలం ముఖ్యమా? శీలమే ముఖ్యమైనపుడు చేయిచాచి సర్టిఫికెట్ ఎందుకు తీసుకోవాలి? ఎందుకు మాట ఇవ్వాలి?

మాట ఇచ్చినపుడు నిలుపుకోవాలి!

ఆ మాటకొస్తే మాట ఇచ్చిన వాళ్ళందరు నిలుపుకొంటున్నారా? లేదే?– మరి నేనెందుకు 'మాట! మాట!' అని మధనపడాలి?

మాట తప్పడమంటే మోసం చేసినట్లు కాబట్టి!

సిద్ధారెడ్డి వస్తాడు. కూలికి పిలస్తాడు. సరేనంటాం. ఆ తర్వాత చెంగారెడ్డి వస్తాడు ఊడిపాయ...జారిపాయ...కొంపలు కూలిపాయ...చేతికందిన పైరు నోటికందదని లబోదిబోమనిఅంటాడు. రాకతప్పదంటాడు.

అయినా సిద్దారెడ్డికి ఇచ్చిన మాటేమాట?

నాట్లు వేసేదానికి వెళ్ళినా ఓట్లు వేసేదానికి వెళ్ళినా మాటకు కట్టుబడే!

మాటమీద బీదాబిక్కకున్న విలువ ఉన్నవాళ్ళకు ఉండదేమో?

ఆలోచిస్తూనే ఉన్నాను. నాకు తెలియకనే ఎలా వెళ్ళానో? వెళ్ళి అతని ముందు నిలబడ్డాను.

"ఆమె వస్తుంది. వస్తే మీరంతా వెళ్ళిపొండి" అని నారాకను ఊహించి అతడు వాళ్ళకు ముందుగానే చెప్పినట్లుంది. నేను అక్కడికి వెళ్ళేసరికి అందరు ఒక్కొక్కరుగా జారుకొన్నారు.

"బాగున్నారా?" నేనే అడిగాను.

"నువ్వు?"

"బాగున్నాను– చంద్రగిరినుండి తిరుపతికి ట్రాన్సఫరయిందా?"

"అవును"

"ఎన్నాళ్ళయింది"

"ఆరునెలలయింది"

"అందుకే చంద్రగిరిలో కనపడలేదు"

పచ్చి అబద్ధం!

అతడు ముసిముసిగా నవ్వాడు.

"ఆరునెలలుగా రావాలని అనుకొంటూనే ఉన్నాను"

"ఇప్పుడు వచ్చావు కదా?"

ఆమాటతోకూడా అతడు స్కూటర్ స్టార్ట్‌చేశాడు. 'కూర్చోండి' అన్నాడు. మాట మంత్రంలా పనిచేసింది. మారు మాట్లాడకుండా పెద్ద అనుభవమున్న దానిలా ఎక్కికూర్చున్నాను. అటు

తిరిగి ఇటుతిరిగి ఆ స్కూటర్ ఓ లాడ్జిముందు నిలబడింది. నేను దిగాను. అతడు స్కూటర్ పక్కన పెట్టి వచ్చాడు. ఇద్దరం లోనికి నడుస్తున్నాం. కనిపించినవాళ్ళంతా పైకిలేస్తున్నారు. లేచినవాళ్ళంతా నమస్కరిస్తున్నారు.

ఎక్కడికి వెళ్ళినా ఆ మన్నన మర్యాద అతనికే తగు!

ఆ లాడ్జిలో ఓ గదిలో కూర్చున్నాం. అతడేదో తాగాడు. నేనేదో తిన్నాను. ఆ తర్వాత తలుపు మూశాడు. అప్పుడు అడిగాడు. నన్ను ఎవరనుకున్నావ్? అని!

"చంద్రగిరి రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ కదా?"

అతడు పకపక నవ్వుతూ 'కాదు!' అన్నాడు.

నేను ఎగిరిపడి పైకి లేచాను.

"అయితే ఎవరు నువ్వు?"

"లాయర్ దివాకర్‌ని!"

"ముందు తలుపు తెరువు. మంచిగా బయటికి నడువు. మనిషిని పోలిన మనిషి ఉండవచ్చు. అంతమాత్రాన నావేలితో నా కన్నే పొడవాలనుకొన్నావా? అదేవీ కుదరదు. అడుగుముందుకు వేశావో? అల్లరి చేస్తా. నీ బతుకు వీధులపాల్జేస్తా!"

అతడు మళ్ళీ పకపక నవ్వాడు!

"ఇది సినిమాకాదు విలన్‌లా నవ్వడానికి! కాయకష్టం చేసిన వొళ్ళు! దెబ్బకుపైకి లెయ్యలేవు."

"ఒసే పిచ్చిదానా? నేను చంద్రగిరి ఆర్.ఐ.నే. అందులో అనుమానమెందుకు? నిజంగా నామీద అభిమానం ఉందా? లేదా? తెలుసుకుందామని నీ మనస్సును పరీక్షించాలని..."

"అది కదా మరి?" అన్నాను.

ఆ తర్వాత అతడు నన్ను బస్టాండ్‌లో దిగబెడుతూ-

'వాడెవుడో పాపం చంద్రగిరి ఆర్.ఐ. వాడి దురదృష్టం... నా అదృష్టం. బతుకే అంత. ఒకటి దురదృష్టం ఇంకొకడి అదృష్టమైనపుడే ఒకడు సుఖపడుతున్నాడు. వాడా ఆర్.ఐ. ఎప్పుడైనా ఎదురుపడ్తే మొన్న మనం కలిశాం కదా? అని వాగేవు. నేను అర్.ఐ.ని కాదు. లాయర్‌ని. నాపేరు దివాకర్. మళ్ళీ అవసరమైతే కోర్టు దగ్గర కనపడు!"

వాడు స్కూటర్ ఎక్కి తుర్రుమన్నాడు.

అరికాలమంట నెత్తికెక్కింది.

"అమ్మలారా! అయ్యలారా! రండి! నాకు జరిగిన అన్యాయాన్ని వినండి. న్యాయం కోసం గౌను తొడుక్కొని న్యాయస్థానాల్లో నిలబడే వెధవచేసిన పని న్యాయమా చెప్పండి." అని బస్టాండ్‌లో గొంతెత్తి అరవాలనిపించింది.

అరిస్తే- "ఎందుకిలా అరుస్తావ్ ఆర్.ఐ. అయినా లాయర్ అయినా శీలాన్ని పోగొట్టుకొన్న ఆడదానివి. ఆడదానికి శీలం ముఖ్యం. ఆ శీలాన్ని ఎలా పోగొట్టుకొన్నా ఒక్కటే!" అని అంటారని నాకు తెలుసు. చేతులెత్తి నమస్కరిస్తాను. దయచేసి ఆమాట మాత్రం అనకండి. శీలం తెరవెనుక ఈ లోకంలో ఎన్ని చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయో నాకు తెలుసు. మీకు తెలుసు. ఏనాడు చేయిచాపి సర్టిఫికెట్ అందుకొన్నానో ఆనాడే పతనమయ్యాను- మానసికంగా. మానసిక పతనం దైహికపతనం కంటే దారుణమని మీరే అన్నారు. నిజంగా అతడు ఆర్.ఐ. అయి వుంటే ఏమి చేసేవాడో? ఆరునెలలుగా అతని పరిధిలోనే ఉన్ననన్ను మరిచిన మంచివాడి ప్రవర్తన శంకించడానికి అవుతుందా? అది ధర్మమా? అందుకే నా శీలాన్ని గురించి కాదు నా అమాయకత ఆసరాగా నాకు జరిగిన అన్యాయాన్ని గురించి ఆలోచించమంటున్నాను!

•అమాయకులకు అన్యాయం జరగకూడదని ప్రభుత్వాలు...పోలీసులు.. న్యాయస్థానాలు పకడ్బందీగా పనిచేస్తూనే ఉన్నాయ్. నాలాంటి అమాయకుల బతుకులిలా తెల్లారి పోతూనే న్నాయ్! చరిత్ర నడుస్తూనే ఉంది!! ●

విపుల
(1, సెప్టెంబరు 1990)